సాక్షి
అనంతపురం
శుక్రవారం । 22 । నవంబర్ । 2024



టన్ను చీనీ రూ.39,200

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.39,200 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.28

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.28, కనిష్టంగా రూ.16, సరాసరిన రూ.23 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.5°/15.1°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలివాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కళ్యాణదుర్గం: రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం కళ్యాణదుర్గం సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వస్తున్న టెక్నాలజీ వివరాలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. రబీ పంటల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సేకరించాలన్నారు. ఎరువులను సకాలంలో రైతులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓలు ఎల్లప్ప, ఏఓలు జగదీష్, పృథ్వీసాగర్, సరిత, మహేష్, జాఫర్, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

24న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం: జిల్లా మహిళలు, పురుషుల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక ప్రక్రియ ఈ నెల 24న ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు బాస్కెట్‌బాల్ జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ కేఎం హబీబుల్లా, జనరల్ సెక్రటరీ కే. నరేంద్ర చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా మార్తేరులో జరగనున్న ఏపీ సీనియర్ అంతర్ జిల్లా బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఈ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయని పేర్కొన్నారు.

రేపు జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

గుంతకల్లు: పాత గుంతకల్లులోని రాజేంద్ర ప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌లో ఈ నెల 23న (శనివారం) ఉమ్మడి అనంతపురం జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి లక్ష్మన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా సంతనూతనపాడులో డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే పోటీల్లో ఎంపికైన జిల్లా జట్లు పాల్గొంటాయన్నారు. మరిన్ని వివరాలకు 94410530441, 9966224669కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

స్కూళ్లలోనే ఆధార్ కేంద్రాలు

అనంతపురం ఎడ్యుకేషన్: 'అపార్' ఐడీ జనరేషన్‌లో భాగంగా విద్యార్థుల ఆధార్ కార్డు సవరణల కోసం పడుతున్న ఇబ్బందులు తప్పనున్నాయి. అపార్ ఐడీ జనరేషన్‌కు విద్యార్థుల ఆధార్ కరెక్షన్‌కు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ఇదే అదనుగా కొందరు ఆన్‌లైన్ కేంద్రాల నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారు. స్కూల్ రికార్డులు, ఆధార్‌లో వివరాల్లో వ్యత్యాసాలు ఉండటంతో ఆధార్ సవరణ తప్పనిసరి అయింది. ఇందుకోసం తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించిన కలెక్టర్ వినోద్‌కుమార్ స్కూళ్ల వద్దే తాత్కాలికంగా ఆధార్ కరెక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. తల్లిదండ్రులు ఎక్కడికీ వెళ్లకుండా పాఠశాల వద్దకు వెళ్లే ఆధార్ సవరణలు చేస్తారని డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు. నిర్దేశించిన రుసుం చెల్లించి సవరణ చేయించుకోవాలని కోరారు. ప్రతి స్కూల్‌కు షెడ్యూలు ఖరారు చేశామని, ఆ మేరకు ఆయా తేదీల్లో స్కూళ్ల వద్దకు వెళ్లి ఆధార్ కరెక్షన్లు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్కూళ్ల హెచ్‌ఎంలను, ఎంఈఓలను సంప్రదిస్తే తెలియజేస్తారన్నారు.

రహదారి పనులు త్వరగా పూర్తి చేయండి



వివరాలు తెలుసుకుంటున్న జేసీ

బుక్కరాయసముద్రం/పుట్లూరు: జాతీయ రహదారి (544) నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. గురువారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో రహదారి పనులను ఆయన పరిశీలించారు. పుట్లూరు మండలంలోని అరకటివేముల రెవెన్యూ పరిధిలో పరిహారం చెల్లింపు కోసం రైతుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎక్కడా పనులు పెండింగ్ ఉంచకూడదన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి భూములు కోల్పోతున్న నిర్వాసితులతో జేసీ మాట్లాడారు. ఇంకా ఎవరైనా ఉంటే ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవ నాయుడు, తహసీల్దార్లు పుణ్యవతి, రజాక్‌వలి తదితరులున్నారు.

రయ్‌మంటూ.. హడలెత్తిస్తూ

- పెరిగిన హైస్పీడ్ రైడింగ్ సంస్కృతి
- రేస్‌కోర్స్‌లా మారిన జాతీయ రహదారి
- రాత్రి పూట పోలీసుల గస్తీ ఉండకపోవడంతో ఇష్టారాజ్యం
- రోడ్డు ప్రమాదాల్లో 70 శాతం ద్విచక్రవాహనదారులే మృత్యువాత



అనంతపురంలో బైక్‌పై యువకుడి విన్యాసాలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రోడ్లపై బుల్లెట్‌లా దూసుకెళ్లడమనే సంస్కృతి కుర్రాళ్లలో నాటుకుపోయింది. కొందరికి ఇది హాబీగా మారగా, మరికొందరు ఐడెంటిటీ (గుర్తింపు) కోసం ఇలా దూసుకెళ్తున్నారు. ద్విచక్రవాహనాల వేగం రోజురోజుకూ శ్రుతి మించుతున్నట్టు తెలుస్తోంది. కొంతమంది బైక్ రైడర్లు బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిని రైడింగ్ అడ్డాగా మార్చుకున్నారు. వారాంతాల్లో బృందాలుగా ఏర్పడి మెరుపుతీగల్లా దూసుకెళ్లడం వాహన చోదకులను నివ్వెరపోయేలా చేస్తోంది. రాత్రిపూట రోడ్లపై రవాణా, పోలీసు సిబ్బంది గస్తీ ఉండదని తెలుసుకుని ఇలా అత్యధిక సామర్థ్యం కలిగిన బైక్‌లలో మితిమీరిన వేగంతో వెళుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదాల్లో ప్రాణాలొదులుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో 70 శాతం ద్విచక్రవాహనదారులే మృత్యువాత పడుతుండటం గమనార్హం.

ఒళ్లు గగుర్పొడిచేలా బైక్ విన్యాసాలు

జాతీయ రహదారుల్లో మితిమీరిన వేగంతో వెళ్లడం ఒక ఎత్తయితే..బైక్‌పై విన్యాసాలు చేస్తూ వెళ్తున్న వారిని చూసి మిగతా వాళ్లు భయపడిపోతున్నారు. ముందు చక్రాన్ని పూర్తిగా పైకి లేపి వెనుక చక్రం మీదనే రెండు మూడు కిలోమీటర్లు వెళుతున్నారు. వెనుకవైపు మరొకని కూర్చోపెట్టుకుని కూడా ఇలా చేస్తున్నారు. బైక్‌పై నిలబడి చేతులు వదిలి వెళ్లడం, బైక్ హేండిల్‌ను నేలకు తగిలించారా అనిపించేలా బండిని వంచి నడపడం చూస్తే ఒళ్లు జలదరిస్తోంది. నిత్యం వేలాది వాహనాలు వెళ్లే బెంగళూరు–హైదరాబాద్ హైవేపై ఈ విన్యాసాలు తీవ్ర ప్రమాదాలకు సంకేతాలిస్తున్నాయి.

భారీ సామర్థ్యమున్న టూవీలర్లు

ఐదారేళ్ల క్రితం వరకూ 160 సీసీ సామర్థ్యం కలిగిన బైకు అంటే చాలా గొప్ప. పల్సర్ తీసుకోవడమే ఎక్కువని అనుకునే వారు. ఇప్పుడా రోజులు పోయాయి. 250 సీసీ మొదలుకొని 1,000 సీసీ వరకూ వెళ్లాయి. 650 సీసీ బైకులు ఇటీవలి కాలంలో జిల్లాలో బాగా పెరిగినట్టు రవాణా శాఖ అధికారుల పరిశీలనలో తేలింది. అధిక సామర్థ్యం కలిగిన బైకుల్లో జాతీయ రహదారిపై కనిష్టంగా 160 కిలోమీటర్ల స్పీడు వెళతామని ఒక బైక్ రైడర్ చెప్పుకొచ్చారు. హెల్మెట్, జాకెట్, గ్లౌజ్‌లు వేసుకుని నడిపితే స్పీడు మేనేజ్ చేయచ్చునని మరో రైడర్ చెబుతున్నారు. ఇలా హైస్పీడు రైడింగ్‌కు వెళ్లే కుర్రాళ్లు 24 ఏళ్ల లోపు వాళ్లే కావడం విశేషం.

తల్లిదండ్రులే కొనిస్తున్నారు

ప్రస్తుత పరిస్థితుల్లో 100 సీసీ బైకు కూడా రూ.లక్ష దాటింది. అలాంటిది 650 సీసీ బైకు ఎంత ఉంటుందో అంచనా వేయలేం. జీటీ 650 బైకు మార్కెట్‌లో ప్రస్తుతం రూ.6 లక్షలు ఉంది. 1,000 సీసీ బైకు అయితే రూ.9 లక్షలు పైమాటే. ఇంత ఖరీదైన బైకులు కూడా తల్లిదండ్రులు తమ బిడ్డలు అడగ్గానే కొనిస్తుండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇంత సామర్థ్యం కలిగిన బైకు నీకెందుకు అని కూడా అడక్కుండానే రూ.లక్షలు పోసి కొనిస్తున్నారు.

టీ తాగడానికి బెంగళూరుకు!

అనంతపురం నుంచి బెంగళూరు కెంపెగౌడ ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలో ఉన్న నంది ఉపచార్ హోటల్‌కు టీ తాగడానికి సరదాగా వెళుతున్నారు. సుమారు 190 కిలోమీటర్లు ఉన్న ఈ దూరాన్ని గంటన్నర లోపే చేరుకుంటున్నారు. 160 నుంచి 180 కిలోమీటర్ల వేగంతో నడుపుతున్నట్టు బైక్‌రైడర్లు చెబుతున్నారు. వీరిలో కొంతమంది యువ డాక్టర్లు ఉన్నట్టు కూడా తెలుస్తోంది. అయితే బెంగళూరు – హైదరాబాద్ హైవేపై రాత్రి సమయంలో బైక్ రేసింగ్ జరుగుతున్నట్లు తమ దృష్టికి రాలేదని, వీటిపై దృష్టి సారిస్తామని అనంతపురం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వీర్రాజు 'సాక్షి'కి తెలిపారు.

జిల్లాలో అత్యధిక సామర్థ్యమున్న ద్విచక్ర వాహనాలు (అంచనా)

కేటగిరీ	సామర్థ్యం	సంఖ్య
హార్లీడేవిడ్‌సన్	1000 సీసీ	05
కవాసాకి, నింజా	650 సీసీ	30
రాయల్‌ఎన్‌ఫీల్డ్	350 సీసీ	2,500
కేటీఎం స్పాట్	390 సీసీ	1,550

జిల్లాలో 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఇలా

మొత్తం ప్రమాదాలు	384
మృతిచెందిన వారు	239
గాయపడిన వారు	439
(ఇందులో 70 శాతం ద్విచక్ర వాహనదారులే)	

నేరాలపై ఉక్కుపాదం



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం: నేరాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గురువారం జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారు, ట్రిబుల్ రైడింగ్, ఓవర్ లోడింగ్, డ్రంకన్ డ్రైవింగ్ తదితర రోడ్డు భద్రతా ఉల్లంఘనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం 515 కేసులు నమోదు చేశారు. రూ.1,46,090 జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 59 కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 19 కేసులు నమోదు చేశారు. అలాగే, ఆత్మకూరు, రాయదుర్గం పోలీసులు వేర్వేరుగా పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి రెండు కేసులు నమోదు చేశారు. 16 మందిని అరెస్ట్ చేసి రూ.46,260 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్లలో అర్ధరాత్రి వేళ అనుమానాస్పదంగా సంచరిస్తున్న అపరిచితులు 110 మందిని తనిఖీ చేసి 16 మందిని పోలీసు స్టేషన్లకు తరలించారు. ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 163 ఏటీఎం సెంటర్లను తనిఖీ చేశారు.

- నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. జిల్లాలో మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు తావుండకూడదన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రజలు కూడా సహకారం అందించాలని కోరారు.

'ఖాకీ' వనంలో కలుపుమొక్కలు

- అనంతపురం నగరంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గంజాయికి సంబంధించిన ప్రతి అంశమూ ఆ ఇద్దరు కానిస్టేబుళ్లకు పక్కాగా తెలుసు. ఏదైనా రైడింగ్ జరుగుతుందంటే ముందస్తుగా సమాచారం ఇచ్చేస్తారు. దీంతో గంజాయి ముఠా పోలీసుల కన్నుగప్పి తప్పించుకునేది. ఆయా కానిస్టేబుళ్ల ఆగడాలు విచారణలో బహిర్గతం కావడంతో ఎస్పీ వేటు వేశారు.
- తాడిపత్రి పరిసరాల్లో మట్కాకు అండగా ఉన్న కొందరు పోలీసుల కదలికలపై ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. మట్కా నిర్వాహకులు, వీరికి సత్సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. వివరాలు తెలుసుకున్న ఎస్పీ వారిని వీఆర్‌కు పంపారు.

- జిల్లాలో 15 మంది పోలీసులను వీఆర్‌కు పంపిన ఉన్నతాధికారులు
- ఉన్నతాధికారుల పరిశీలనలో మరికొన్ని పేర్లు!



అనంతపురం: ఖాకీ చొక్కాకు అవినీతి మరక అంటుతోంది. కొందరు పోలీసులు నేరస్తులతో స్నేహం చేస్తున్నారు. గంజాయి స్మగ్లర్లు, పేకాట నిర్వాహకులతో జట్టుకట్టి అవినీతికి పాల్పడుతున్నారు. సివిల్ కేసుల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, అమ్మకాలను రూపుమాపేందుకు ఉన్నతాధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తుంటే, అసాంఘిక శక్తులకు ముందస్తుగా సమాచారం అందించి వారిని తప్పిస్తున్నారు. పోలీసు ప్రతిష్టను మసకబారుస్తున్నారు.

విచారణలో బహిర్గతం..

రెండు రోజుల క్రితం జిల్లాలో ఏకంగా 15 మంది కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపడం చర్చనీయాంశమైంది. వీరిలో పలువురు గంజాయి స్మగ్లర్లతో కలిసి అవినీతికి పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడిన నిందితులను విచారించగా వీరి బాగోతం వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

రెండో జాబితా సిద్ధం!

అవినీతి పోలీసుల వివరాలను సేకరించే పనిలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. రెండో జాబితా సిద్ధమైందని, త్వరలో మరికొందరు పోలీసులపై వేటు పడనున్నట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ వర్గాలతో పాటు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగానే జాబితాలో పేర్లు చేరుస్తున్నారు. ఇందులో సీఐలు, ఎస్‌ఐలు కూడా ఉన్నట్లు సమాచారం. పేకాట స్థావరాలకు దన్నుగా నిలుస్తున్న ఎస్‌ఐల వివరాలను సైతం పోలీసు ఉన్నతాధికారులు సేకరించారు. సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ సెటిల్‌మెంట్‌లు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి.

అక్రమ కేసులకు ఎవరూ భయపడొద్దు

- న్యాయపరంగా ముందుకెళ్దాం
- ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎవరూ భయపడొద్దు. బలంగా నిలబడదాం. అక్రమ కేసులు, అరెస్టులపై న్యాయపరంగా ముందుకెళ్దాం' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం పార్టీ లీగల్ సెల్, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సోషల్ మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు, వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఏ కష్టం వచ్చినా జిల్లా అధ్యక్షుడిగా తాను తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. త్వరలో జిల్లా స్థాయిలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 'పోరాటం అనేది మన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొత్తేమీ కాదు. మనం పోరాటం చేస్తోంది పదవుల కోసం కాదు. రాష్ట్ర ప్రజలకు మంచి జరగడం కోసం' అని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి సోషల్ మీడియా ఎంతో కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా లీగల్ సెల్ అందుబాటులో ఉండి సమస్యను పరిష్కరిస్తుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైఫల్యాలను ఎత్తి చూపాలి..

కూటమి ప్రభుత్వం ఐదు నెలలుగా ఏమీ చేయక పోయినా సీఎం చంద్రబాబు మాత్రం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అనంత దుయ్యబట్టారు. రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్నట్లు బిల్డప్ ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రతిక్షణం ఎత్తి చూపి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామని, వాటిని కూడా మరోసారి గుర్తు చేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారన్నారు. పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి మాట్లాడుతూ సోషల్ మీడియా యాక్టివిస్టులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలోనూ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ప్రత్యేకంగా న్యాయ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరికి ఏ సమయంలో అవసరం వచ్చినా లీగల్ సెల్ టీంలను సంప్రదించాలన్నారు. వైఎస్సార్ సీపీ టాస్క్‌ఫోర్స్ జిల్లా ప్రతినిధి రమేష్‌గౌడ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాకే చంద్రశేఖర్, నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అక్రమ కేసులపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని, అందరూ కలసికట్టుగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు రాజశేఖర్ యాదవ్, వెంకటరాముడు, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్‌కృష్ణ, తిమ్మారెడ్డి, ప్రభుకుమార్, భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, నాగన్న, అన్ని నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ అందడం లేదు

- కలెక్టర్‌కు నేత కార్మికుడి ఫిర్యాదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: మగ్గం నేస్తున్న తనకు ఉచిత విద్యుత్ పథకం వర్తింపజేయడం లేదని ఓ నేత కార్మికుడు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ గురువారం స్థానిక ఆకాశవాణి కేంద్రం నుంచి నిర్వహించిన 'అనంత మిత్ర ఫోన్ ఇన్' కార్యక్రమానికి 19 ఫిర్యాదులు అందాయి. కూడేరు మండలం గుట్కూరు గ్రామానికి చెందిన గంగన్న మాట్లాడుతూ ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకుని రెండు నెలలవుతున్నా గతంలో మాదిరిగానే బిల్లు వస్తోందని వాపోయారు. అధికారులను సంప్రదిస్తే స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మగ్గాలు నేసే వారికి ఉచితంగా 100 యూనిట్ల వరకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. డేటా ఎంట్రీలో నమోదు పేరు కాలేదేమో అధికారులు చూసి సమస్యను పరిష్కస్తారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, ప్రోగ్రాం డైరెక్టర్ నాగేశ్వర రెడ్డి, డీఈఈ రామకృష్ణ, ఏఈలు భానుప్రకాష్, జేసీ మునిరాజా పాల్గొన్నారు.

ఫిర్యాదులు, కలెక్టర్ సమాధానాలు ఇలా...

- నా పేరు గోవిందరెడ్డి. మాది కళ్యాణదుర్గం మండల గోళ్ల గ్రామం. మేం నలుగురు అన్నదమ్ములం. నా పేరు మీద ఒక ట్రాన్స్‌ఫార్మర్ కావాలని దరఖాస్తు చేసుకున్నా. మా పొలం సర్వే నంబరును అధికారులు తప్పుగా వేశారు. దీంతో ఆలస్యం అవుతోంది. సాగు చేసుకుంటున్న దానిమ్మ, అరటి పంటలు నష్టపోయే అవకాశం ఉంది.
- **కలెక్టర్ సమాధానం:** మీ ఫోన్ నంబరు, పేరు, సమస్యను నమోదు చేశాం. ఇంజినీర్లు మిమ్మల్ని సంప్రదించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు.
- నా పేరు రాఘవేంద్ర. పెద్దవడుగూరు మండలం బీసీ కాలనీ. 2003లో మా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. అప్పట్లో ప్రైవేటు స్థలంలో స్తంభాలు ఏర్పాటు చేశారు. స్థలం వారు అభ్యంతరం తెలపడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో కొత్తగా స్తంభాలను నాటారు. అయితే విద్యుత్ తీగలు ఏర్పాటు చేయలేదు. దీంతో కరెంట్ సరఫరా కావడం లేదు. అధికారులను అడిగితే 'ప్రభుత్వం నుంచి కేబుల్ సరఫరా లేదు. ఇంకా ఆలస్యం అవుతుంది. సొంతంగా ఏర్పాటు చేసుకోవాలన్నారని' చెప్పారు.
- **కలెక్టర్:** ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, తీగలు అవసరమని ఇటీవల ప్రభుత్వానికి నివేదించాం. 40 ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు వచ్చాయి. మీ ఫిర్యాదుకు ప్రాధాన్యత ఇస్తూ సమస్యను పరిష్కరిస్తాం.
- నా పేరు వెంకట కృష్ణమూర్తి. శింగనమల మండలం ఉల్లికల్లు ఎస్సీ కాలనీ. మా ఇంటికి 2016లో విద్యుత్ కనెక్షన్ తీసుకున్నాం. విద్యుత్ బిల్లు రూ.22 వేలు రాగా, విషయాన్ని అధికారులకు చెప్పా. దీంతో వారు ఎంతోకొంత చెల్లించి ఒక అర్జీ ఇవ్వాలని చెప్పడంతో రూ.1,400 కట్టాను. ఈ విషయంపై ఇప్పటి వరకు ఏఈ నుంచి ఎలాంటి స్పందన లేదు.
- **కలెక్టర్:** అంత మొత్తం బిల్లు ఏ సంవత్సరం, ఏ నెలలో వచ్చిందో చెప్పడం లేదు. చాలా నెలల నుంచి సమస్య ఉందని అంటున్నారు. బిల్లును జాగ్రత్తపరిచి ఉండాల్సింది. పేరు, ఫోన్ నంబరు నమోదు చేసుకున్నాం. ఏఈ మిమ్మల్ని కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ఎస్సీ గృహాలకు 100 యూనిట్ల వరకు ప్రభుత్వం రాయితీ ఉంటుంది. అంతకు మించి వినియోగించిన విద్యుత్తుకు బిల్లు కట్టాలి.

సమాజమా నువ్వెక్కడ?



శిరీష



కుమారుడితో కృష్ణకిశోర్

అందరి గురించి ఆలోచించేవాడు
నలుగురికీ తల్లోనాలుకలా ఉండేవాడు
ఎవరికి ఏ జబ్బుచేసినా మందులిచ్చి నయం చేసేవాడు
సాయమంటే ముందుండేవాడు
ఆయనకే కష్టం వస్తే...
అయ్యోపాపం అనలేకపోయావా
కాస్త ఆదరణచూపలేకపోయావా?
జీవితంపై విరక్తి చెందితే ..
ఊరడింపుగా నాలుగు మాటలు చెప్పలేకపోయావా
కుటుంబంతో ఉరికంభమెక్కితే...
అలా చూస్తూ ఊరుకున్నావా
పసిగుడ్డు గొంతునులిమేసేంతగా మార్చేశావా..
ఆయువు ఆగి ఐదురోజులైనా కన్నెత్తి చూడలేకపోయావా
ఇప్పుడంతా అయిపోయింది..
ఆ మనిషి లేడు..ఆ కుటుంబమూ లేదు
నువ్వుండు.. నూరేళ్లు
నిర్దయగా...నిక్షేపంగా..
అలా నువ్వున్నా..లేనట్టే!
అందుకే అతను.. తన ఐదు నెలల ప్రతిరూపాన్ని వెంటతీసుకెళ్లాడు..

నార్పలకు చెందిన కృష్ణకిశోర్, శిరీష దంపతులు ఉరి వేసుకుని చనిపోగా..ఐదురోజుల తర్వాత ఇరుగుపొరుగు గుర్తించారు. లోనికి వెళ్లి చూడగా..వారి ప్రేమకు ప్రతిరూపమైన ఐదు నెలల పసికందు ఊయలలో నిర్జీవంగా కనిపించింది. ఈ దృశ్యాన్ని చూసిన మనసున్న మనిషెవరైనా ఇలాగే ప్రశ్నిస్తున్నాడు.. సమాజమా...నువ్వెక్కడా అని..

జీవాల సంరక్షణ చర్యలు చేపట్టండి

• పశుశాఖ జేడీ, ఏడీడీఎల్ ఏడీ సూచన



అనంతపురం అగ్రికల్చర్: చలికాలంలో జీవాలకు సంక్రమించే జబ్బులు, వాటి సంరక్షణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పెంపకందారులకు పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలు, రాత్రి, ఉదయం పూట ఉష్ణోగ్రతలు తగ్గుతున్న నేపథ్యంలో గొర్రెలు మేకలు, వాటి పిల్లలకు వ్యాధులు సంక్రమించకుండా తీసుకోవాల్సిన చర్యలను వారు వివరించారు.

- చలిని తట్టుకునే శక్తి వచ్చే వరకూ తల్లి గొర్రె నుంచి పాలు అందేలా గొర్రె పిల్లలను చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల గొర్రె పిల్లల్లో ఎదుగుదల, వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. చిన్నవాటికి చలిగాలులు తగలకుండా, శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- జీవాలు ఉండే ప్రాంతాల్లో భూమిలో తేమశాతం లేకుండా ఉండాలి. పొడి వాతావరణం, ఎత్తైన ప్రదేశాలను ఎంచుకోవాలి. లేదంటే తేమ వల్ల పరాన్నజీవులు, సూక్ష్మజీవుల బెడద ఎక్కువై వ్యాధులు ప్రబలి మరణాలు సంభవిస్తాయి.
- గొర్రె, మేక పిల్లలు మట్టిని నాకకుండా చూసుకోవాలి. లేకుంటే పారుడురోగం లాంటి వ్యాధులు సోకుతాయి. ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్చర్) కలిగిన ఇటుకలను పిల్లల గూళ్లలో వేలాడదీయాలి. పిల్లలను ఎక్కువ సంఖ్యలో ఉంచితే ఒత్తిడి నెలకొంటోంది కాబట్టి విశాలంగా, శుభ్రంగా గాలి వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలి. రాత్రిళ్లు వెచ్చదనం ఉండేలా లైట్లను లేదంటే అడ్డుతెరలు ఏర్పాటు చేయాలి.
- చలికాలంలో ఈగలు, దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. పరిసరాల పరిశుభ్రత పాటించాలి. గోమార్ల నివారణ చర్యలు చేపట్టాలి. చిన్న పిల్లలను బయట ప్రదేశాల్లో ఉంచితే దోమతెరలు వాడాలి. చిన్నపాటి షెడ్లలో పట్టలు కప్పి అందులో పెంచడం ఉత్తమం.
- జబ్బులు వ్యాపిస్తే మందలోని పిల్లలను వేరు చేయాలి. పిల్లలన్నింటికీ ఎంటీ-ఈటీ టీకాను వేయించాలి. యాంటీబయోటిక్స్, బీ-కాంప్లెక్స్, లివర్ టానిక్‌లు, ఈస్ట్ కల్చర్‌లు, జీర్ణక్రియ మందులు, ఐరన్, క్యాల్షియం తదితర మందులు పశువైద్యుని సూచన మేరకు వాడాలి.
- ఇప్పటికే ముందస్తు జాగ్రత్త కింద 8.03 లక్షల జీవాలకు మూతిపుండ్ల, నీలినాలుక వ్యాధి (బ్లూటంగ్) టీకాలు ఉచితంగా వేశారు. ఈ వ్యాధి సోకితే ఎక్కువగా జ్వరం, మూతి వాపు, నోటిలో పుండ్లు, పెదవులు దద్దరించడం, ముక్కు నుంచి చీమిడి కారడం లాంటి లక్షణాలు ఉంటాయి. నివారణ చర్యలు చేపట్టకపోతే 30 శాతం వరకు మరణాలు ఉంటాయి. సాయంత్రం పూట గొర్రెల మందలో వేపాకు పొగ వేయడం, అపుడపుడు బ్యూటాక్స్ లేదా టిక్కెల్ లాంటి మందులు పిచికారీ చేయడం, పొడి ప్రాంతాల్లో మేపుకోవాలి. పశువైద్యున్ని సూచన మేరకు నివారణ చర్యలు చేపట్టాలి.
- కాలిగిట్టల మధ్య చీము చేరి చెడు వాసన రావడం, కుంటడం లాంటి లక్షణాలు ఉంటే కాలిపుండ్ల వ్యాధి (ఫుట్‌రాట్)గా గుర్తించి బురద ప్రాంతాల్లో మేపకుండా చూడాలి. నట్టల మందు తాపించాలి. కాలిపుండ్లు బాగా కడిగి పసుపు లేదా ఆయింట్‌మెంట్ రాసి మట్టి తగలకుండా రెండు రోజులు యాంటీబయాటిక్స్ ఇవ్వాలి.

క్లుప్తంగా

బీసీసీఐ అండర్-15 టోర్నీలో మెరిసిన జిల్లా అమ్మాయిలు



చక్రిక



తేజస్విణి

అనంతపురం: మహారాష్ట్రలో జరుగుతున్న అండర్ 15 బీసీసీఐ ఉమెన్ క్రికెట్ టోర్నీలో జిల్లాకు చెందిన అమ్మాయిలు మెరిశారు. గురువారం ఆంధ్ర, మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో జిల్లాకు చెందిన చక్రిక మూడు వికెట్లు సాధించి సత్తా చాటింది. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ జట్టు గెలుపులో కీలకంగా మారింది. 35 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 193 పరుగులు సాధించిన ఆంధ్ర జట్టులో బ్యాటర్లు దీక్ష 52 పరుగులు, పుష్పిత 42 పరుగులతో మంచి భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం మహారాష్ట్ర జట్టు పది వికెట్ల నష్టానికి కేవలం 111 పరుగులు మాత్రమే చేసింది. ఎడమచేతి లెగ్ స్పిన్నర్ డి.చక్రిక ధాటికి మహారాష్ట్ర బ్యాటర్లు కంగుతిన్నారు. ఈ మ్యాచ్‌లో ఆమె మూడు వికెట్లు తీసింది. మరో బౌలర్ బి.తేజస్విణి (కుడి చేతి పేసర్) రెండు వికెట్లు తీసి ప్రతిభ చాటింది.

చిరుత దాడిలో గొర్రెల మృతి

కుందుర్పి: చిరుత దాడిలో రెండు గొర్రెలు మృతి చెందాయి. కుందుర్పి మండలం కెంచంపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఈరన్న గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో పాకలోకి చిరుత చొరబడడంతో గొర్రెలు బెంబేలెత్తి గట్టిగా అరవసాగాయి. దీంతో అప్రమత్తమైన ఈరన్న గట్టిగా కేకలు వేస్తూ పాక వద్దకు చేరుకుంటుండగా ఓ చిరుత సమీపంలోని పొదల్లోకి పరుగు తీసింది. పాకలోకి వెళ్లి పరిశీలిస్తే మృతి చెందిన రెండు గొర్రెలు కనిపించాయి. ఘటనతో రూ.25వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు. కాగా, రెండు రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన రామాంజినేయులు పెంచుకున్న గేదెను చిరుత చంపి తినేసింది.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

గుంతకల్లు టౌన్: స్థానిక రైల్వే డీజిల్ షెడ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్న ఎస్.డేవిడ్ ఇంట్లో చోరీ జరిగింది. గుంతకల్లులోని అరవిందనగర్ రైల్వేక్వార్టర్స్ 738-బీ లో నివాసముంటున్న ఆయన... ఈ నెల 16న తన సమీప బంధువు మృతి చెందడంతో ఇంటికి తాళం వేసి కర్నూలుకు వెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంట్లోకి చొరబడి విలువైన బంగారు నగలు, నగదు అపహరించుకెళ్లారు. గురువారం ఉదయం కాలనీ వాసులు గుర్తించి ఫోన్ చేసి తెలపడంతో ఆయన కర్నూలు నుంచి వచ్చి పరిశీలించారు. ఇంటి వెనుక ఉన్న ప్రహరీ దూకి లోపలకు ప్రవేశించిన దుండగులు తలుపులు ధ్వంసం చేసి, బీరువాలోని 4 తులాల బంగారు నగలు, రూ.10 వేలు అపహరించుకెళ్లినట్లు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలిచారు. ఘటనపై దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆహార భద్రతకు 'ఆక్వా' దోహదం

• మత్స్య దినోత్సవంలో అసిస్టెంట్ కలెక్టర్ విన్నూత్న



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ విన్నూత్న

అనంతపురం అగ్రికల్చర్: ప్రపంచ వ్యాప్తంగా ఆహార భద్రత, పోషణ విషయంలో మత్స్య సంపద (ఆక్వా రంగం) కీలకపాత్ర పోషిస్తోందని అసిస్టెంట్ కలెక్టర్ విన్నూత్న అన్నారు. గురువారం స్థానిక మత్స్యశాఖ ఉపసంచాలకులు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రపంచ మత్స్య దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కూడా మత్స్య పరిశ్రమను వృద్ధికారకం (గ్రోత్ ఇంజన్)గా గుర్తించినట్లు తెలిపారు. సంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వాలు చేయూతను ఇస్తున్నాయన్నారు. జిల్లాకు సంబంధించి బీటీపీ, ఎంపీఆర్ డ్యాం, అప్పర్‌పెన్నార్ ప్రాజెక్టుల్లో ఉచితంగా 24.98 లక్షల చేపపిల్లల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు జిల్లా మత్స్యశాఖ డీడీ శ్రీనివాసనాయక్ తెలిపారు. అలాగే మత్స్యకార సొసైటీ సభ్యులకు 40 శాతం రాయితీతో 21 లక్షల చేపపిల్లలు ఇవ్వడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లా వ్యాప్తంగా 54 సొసైటీలు, 4,300 మంది మత్స్యకారులు ఉండగా... చేపల పెంపకానికి, వేటకు అనువుగా 99 చెరువులు, ఐదు రిజర్వాయర్లు ఉన్నాయన్నారు. ఏటా రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు టర్నోవర్ జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఇ.అరుణకుమారి, మత్స్యకార సొసైటీ జిల్లా అధ్యక్షుడు నగేష్, కమిటీ సభ్యులు, ప్రాథమిక సొసైటీల అధ్యక్షుడు, మత్స్యశాఖ అధికారులు ఫక్కీరయ్య, ఆసీఫ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫలసాయంలో 'పండు ఈగ'

• రైతులు జాగ్రత్తలు పాటించకపోతే నష్టాలు అధికం
• అవగాహన సదస్సులో ఎన్‌పీహెచ్‌ఎం, 'అపెడా' ప్రతినిధులు



సదస్సులో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల పండ్ల తోటల్లో పండు ఈగ (ఫ్రూట్ ఫ్లై) ప్రధాన సమస్యగా మారిందని, దీని వల్ల రైతులకు నష్టం వాటిల్లుతున్నట్లు నేషనల్ పెస్ట్ సర్వైవలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్‌ఎస్) గుర్తించినట్లు జాతీయ మొక్కల యాజమాన్య సంస్థ (ఎన్‌పీహెచ్‌ఎం), అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా) ప్రతినిధులు తెలిపారు. పండు ఈగ అంశంపై గురువారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఉమ్మడి జిల్లా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, రెండు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు బీఎంవీ నరసింహారావు, జి.చంద్రశేఖర్, టెక్నికల్ హెచ్ఓ పల్లవితో పాటు ఎన్‌పీహెచ్‌ఎం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్యాలజ్యోతి, అపెడా బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పెద్దస్వామి తదితరులు పాల్గొన్నారు. గతంలో కేవలం మామిడిలో మాత్రమే కనిపించే పండు ఈగ ఇటీవల వాతావరణ మార్పులు, విచ్చలవిడిగా రసాయన మందులు వాడకం, మేలైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం లాంటి కారణాలతో జామ, చీనీ, సీతాఫలం, దానిమ్మ లాంటి పండ్ల తోటలతో పాటు బీర లాంటి కూరగాయల పంటలోనూ ఎక్కువగా ఆశించి నష్టం కలుగుజేస్తోందన్నారు. ఈ నష్టంపై రైతుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యాన పంటలు చేతికొచ్చే సమయంలో పండు ఈగ ఆశిస్తే దిగుబడులు తగ్గి రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. దీని నివారణకు పండు ఈగ ఎరలు, మిథైల్ యూజినాల్ ఎరలు ఎకరాకు 6 నుంచి 8 వరకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తోటలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. 1.5 గ్రాముల అసిఫేట్ లేదా 1 గ్రాము డెల్టామైత్రీన్ లేదా పిప్రోనిల్ లాంటి మందుల పిచికారీతో నివారించుకోవాలని సూచించారు. ఎరలు ఏర్పాటు చేసి పురుగు ఉనికి ఉధృతిని బట్టి మేలైన సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో మహిళలు, అమ్మాయిలు, బాలికలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని ఐద్వా, ఎస్ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మహాత్మా గాంధీ విగ్రహం వద్ద విద్యార్థినులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడారు. విశాఖపట్నంలో న్యాయ విద్యార్థినిపై జరిగిన సామూహిక లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణ పేరుతో సమస్యను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తుండడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఐదు నెలల కాలంలో కర్నూలు, అనంతపురం, తిరుపతి, కడప వంటి ప్రాంతాలలో ఇలాంటి సంఘటనలు అనేకం జరిగినా ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో మహిళల కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం షాపులను జన సమూహానికి, కళాశాలలకు దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి చంద్రిక, ఎస్ఎఫ్ఐ బాలికల విభాగం జిల్లా కన్వీనర్ రజిత, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరు, సాయి పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో వైద్య కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా 2025, ఏప్రిల్ రెండో వారంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించబోతున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు. వేడుకల నిర్వహణపై సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ సభ్యులతో గురువారం వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన సంఘం సభ్యులు సమావేశమై చర్చించారు. డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సిల్వర్ జూబ్లీ వేడుకలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రముఖులు, క్రీడ, వైద్య ప్రముఖులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. మూడ్రోజుల పాటు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎంబీబీఎస్ విద్య పూర్తి చేసుకున్న వైద్య విద్యార్థులు అందరూ తప్పనిసరిగా పూర్వ విద్యార్థుల సంఘంలో సభ్యత్వం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యత్వం కోసం రూ.5వేలను కనీస రుసుముగా నిర్ణయించారు. సమావేశంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ చైతన్య, డాక్టర్ నీలిమ, డాక్టర్ శ్రీహర్ష, సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ దుర్గ, డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ వేముల శ్రీనివాసులు, డాక్టర్ శైలజ, డాక్టర్ స్వాతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అరోరా ఫార్మాలో ప్రమాదం... గుత్తి వాసి మృతి



అనిల్ (ఫైల్)

గుత్తి: తెలంగాణాలోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్లలో ఉన్న అరోరా ఫార్మా కంపెనీలో బుధవారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో గుత్తి ఆర్ఎస్‌కు చెందిన అనిల్‌కుమార్ (40) మృతి చెందాడు. ఇదే ఘటనలో మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. బాయిలర్ శుభ్రం చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బాయిలర్ శుభ్రం చేస్తున్న క్రమంలో సాల్వెంట్ ఫైర్ అవ్వడంతో అనిల్ మృతి చెందినట్లుగా తెలిసింది. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి బాల అనంతగిరి కుమారుడు అనిల్ కొన్నేళ్ల క్రితం వలస వెళ్లి అరోరా ఫార్మా కంపెనీలో క్యాజువల్ లేబర్‌గా పనిలో చేరాడు. రోజులాగే బుధవారం డ్యూటీకి వెళ్లిన అనిల్ కుమార్... రియాక్టర్ వద్ద పనిచేస్తుండగా 9.30 గంటలకు రియాక్టర్ పేలింది. ఘటనలో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ఈ విషయాన్ని పరిశ్రమ యాజమాన్యం గోప్యంగా ఉంచడంపై మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సదరు పరిశ్రమ ఎదుట గురువారం ఆందోళన నిర్వహించినట్లు తెలిసింది.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

విడపనకల్లు: తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. విడపనకల్లు మండల కేంద్రంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని మాలగేరి, రసూలమ్మ, సుబ్బలక్ష్మి కాలనీలకు వారం రోజులుగా తాగునీరు సరఫరా చేయడం లేదంటూ సీపీఐ నాయకులు చెంద్రాయుడు ఆధ్వర్యంలో 42వ జాతీయ రహదారిపై మహిళలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సామాన్యులు బతకడం కష్టంగా మారిందని వాపోయారు. కనీసం ప్రజలకు తాగునీరు సరఫరా చేయలేరా అంటూ మండిపడ్డారు. దూర ప్రాంతాల నుంచి బండ్లపైనా, ద్విచక్రవాహనాలపైనా బిందెలతో నీరు తెచ్చుకుంటున్నామని మహిళలు వాపోయారు. అధికారులు తమ గోడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించకుంటే రోడ్డుపై వంటావార్పు చేస్తామని సీపీఐ నాయకుడు చెంద్రాయుడు అధికారులను హెచ్చరించారు. కాగా, జాతీయ రహదారిపై మహిళలు ఆందోళన చేయడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిన్నగౌసు ఘటనాస్థలికి చేరుకొని వారికి సర్ధిచెప్పారు.

మూడింతల ఆనందం

• గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతులు పొందిన శారదా స్కూల్ టీచర్లు
• నగరంలో ఐదు స్కూళ్లకు గాను నాలుగు స్కూళ్లకు వారే హెచ్‌ఎంలు
• నగరపాలక పాఠశాలల్లో చర్చనీయాంశంగా పదోన్నతులు



హెచ్‌ఎంలు వరుసగా శ్రీలత, వాసుకి, శ్రీదేవి, రేణుక

అనంతపురం ఎడ్యుకేషన్: నగరపాలక సంస్థ పరిధిలోని ఉన్నత పాఠశాలల గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు రెండు రోజుల కిందట పదోన్నతులు జరిగాయి. మూడు పోస్టులు ఖాళీ ఉండగా....ఆ మూడింటిలోనూ శారదా బాలికల నగరపాలక ఉన్నత పాఠశాల టీచర్లతోనే భర్తీ కావడం విశేషం. నగరంలో మొత్తం ఐదు స్కూళ్లలో గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులుండగా అందులో నాలుగు స్కూళ్లల్లో శారదా స్కూల్ టీచర్లే హెచ్‌ఎంలు అయ్యారు. ఈ అంశం నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలల్లో హాట్ టాపిక్‌గా మారింది. మునిసిపల్ పాఠశాలల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి కూడా ఇది అరుదైన సందర్భమనే చర్చ సాగుతోంది.

మొదటి టీచరు వద్దని చెప్పడంతో...

హెచ్‌ఎం పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు నగర పాలక సంస్థ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితాను తయారు చేశారు. ఇందులో నేతాజి సుభాష్ చంద్రబోష్ ఉన్నత పాఠశాల బయాలజీ టీచరు ఎస్.లక్ష్మీ మొదటిస్థానంలో ఉంది. ఆ తర్వాత వరసగా శారదా నగరపాలక ఉన్నత పాఠశాల టీచర్లు ఎం.శ్రీదేవి (గణితం), వై.రేణుక (గణితం), ఎస్.వాసుకి (సోషల్), ఎస్.శ్రీలత (గణితం), ఎం.రజియాబేగం (బయాలజీ) ఉన్నారు. మొదటిస్థానంలో ఉన్న ఎస్.లక్ష్మీ పదోన్నతి తీసుకునేందుకు నిరాకరించడంతో తర్వాత 2,3,4 స్థానాల్లో ఉన్న శారద నగరపాలక ఉన్నత పాఠశాల టీచర్లే ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు తీసుకున్నారు. రెండోస్థానంలో ఉన్న ఎం.శ్రీదేవి శ్రీ పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాల, వై.రేణుక రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాల, ఎస్.వాసుకి కస్తూర్బా బాలికల నగరపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా నియామకం పొందారు.

శారదా స్కూల్ హెచ్‌ఎంగా ఎఫ్ఏసీ బాధ్యతలు..

శారదా నగరపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా రమాదేవి కొనసాగుతున్నారు. ఈమె గతంలో పొట్టిశ్రీరాములు పాఠశాల నుంచి పదోన్నతిపై వచ్చారు. 2025 మార్చి 31 వరకు రమాదేవి సెలవు పెట్టారు. దీంతో సీనియార్టీ ప్రకారం శారదా స్కూల్‌కు చెందిన ఎం.శ్రీదేవి ప్రస్తుతం ఎఫ్ఏసీ బాధ్యతలు చూస్తున్నారు. ఆమెకు రెగ్యులర్ హెచ్‌ఎం పదోన్నతి రావడంతో...అదే స్కూల్‌లోని గణితం టీచరు ఎస్.శ్రీలతకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించనున్నారు. మొత్తంమీద నగరంలో గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులు కల్గిన ఐదు స్కూళ్లల్లో నాలుగు స్కూళ్లకు శారదా స్కూల్ టీచర్లే హెచ్‌ఎంలుగా నియామకం కావడం విశేషం.

లస్సీ సెంటర్‌లో చోరీ

అనంతపురం: నగరంలోని కమలానగర్ ఉన్న వినాయక లస్సీ సెంటర్‌లో ఈ నెల 19న అర్ధరాత్రి చోరీ జరిగింది. మొత్తం రూ.లక్ష, ఓ సెల్‌ఫోన్‌ను దుండగులు అపహరించారు. లస్సీ సెంటర్‌లోనే రూ.లక్ష నగదు ఉంచి షాపు మూయడాన్ని నిర్వాహకులు ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి లావాదేవీలు ముగించుకున్న అనంతరం నగదు ఉంచి లస్సీ సెంటర్‌ను మూసివేసి ఇళ్లకు వెళ్లారు. గురువారం జమా ఖర్చులు లెక్కించే సమయంలో చోరీ జరిగిన విషయాన్ని పసిగట్టి ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు. నకిలీ తాళాలు వినియోగించి చోరీ చేశారా? లేక ఇంటి దొంగల పనేనా? అనే కోణంలో విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా- మహిళ మృతి

బొమ్మనహాళ్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ఇటీవల మోటారు బైక్ ప్రమాదంలో గాయపడిన కొలగానహళ్లికి చెందిన సోమును కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గురువారం రాత్రి ఆటోలో ఉద్దేహాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి బయలుదేరారు. అదే ఆటోలో క్యాంపు లక్ష్మి (40) తనకూ ఆరోగ్యం బాగాలేదని, తాను కూడా ఆస్పత్రికి వస్తానంటూ బయలుదేరింది. ఉద్దేహాళ్ సమీపంలోని సాయిబాబా మందిరం వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్ష్మిని 108 అంబులెన్స్‌లో బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. ఆస్పత్రికి చేరుకుంటుండగానే ఆమె మృతి చెందింది. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.



ఊరేగింపులు హారతులతో పాల్గొన్న బాలికలు, మహిళలు

• హవళిగి.. భక్తజన లోగిలి



కర్లే గౌరమ్మదేవి పూల రథం

విడపనకల్లు: మండలంలోని హవళిగి గ్రామం గురువారం భక్తజన లోగిలిగా మారింది. కర్లే గౌరమ్మ రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ప్రత్యేకంగా పూలతో ఎద్దుల బండిపై అలంకరించిన రథంపై కర్లే గౌరమ్మను ప్రతిమను ఉంచి తెల్లవారుజామున గ్రామంలో ఊరేగించారు. జిల్లాలోని వివిధ మండలాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక నుంచి భక్తులు తరలిరావడంతో వీధులన్నీ జనసంద్రమయ్యాయి. రథోత్సవం ముందు 101 కలశాలతో బాలికలు, మహిళలు హారతులు పట్టారు. వివిధ రకాల వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



సత్తా చాటిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ లక్ష్మీనారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం అనంతపురంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. ఎస్‌జీఎఫ్ అండర్–19 విభాగంలో మదన్‌మోహన్ రెడ్డి, శ్రీనాథ్, అక్షయ రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.సత్తా చాటిన విద్యార్థులను ఆర్డీటీ పీఈటీ రఫీ అభినందించారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలి. మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా బహిర్భూమికి ఆరుబయటకు వెళ్తున్నారన్నారు. అలా వెళ్లడం వల్ల రోగాల బారిన పడతారని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. మరుగుదొడ్లు లేని వారు మరుగుదొడ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ మరుగుదొడ్లు వినియోగంపై వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం రూరల్: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం ఐఎంఎల్ డిపోలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు కార్మికుల పొట్టకొట్టేలా ఉన్నాయన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు మోహన్‌రెడ్డి, సంగప్ప, తిరుపాలు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

అనంతపురం: విశాఖపట్నంలో న్యాయ విద్యార్థినిపై అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా లాయర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీరు యాదవ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక లా విద్యార్థిని ఈ అకృత్యాలను తట్టుకోలేక ఆత్మహత్యకు సిద్ధపడింది అంటే ప్రభుత్వ, పోలీస్ వ్యవస్థపై నమ్మకం పోతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రోజూ మహిళలు, పిల్లలపై నేరాలు, అత్యాచార ఘటనలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్తమ టీచర్లకు సన్మానం



ఉత్తమ అవార్డు పొందిన టీచర్లను సన్మానిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ టీచర్ అవార్డులు పొందిన వారిని గురువారం డీఈఓ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో సన్మానించారు. రాష్ట్ర ఉత్తమ ఉర్దూ టీచరు అవార్డు అందుకున్న ఎస్.మహమ్మద్ యాకుబ్, జిల్లా ఉత్తమ ఉర్దూ టీచరు అవార్డు అందుకున్న మహమ్మద్ రఫిక్‌ను డీఈఓ తన చాంబర్‌లో సన్మానించి అభినందించారు. యాకుబ్, రఫిక్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, నాయకులు వెంకటరమణ, సర్దార్‌వలి, గోరంట్ల శ్రీనివాసులు, కలీమ్, సుహేల్, ఇందాదుల్ల, నసరుల్ల, సాదిక్, ముక్తియార్, ఆరీఫ్, మన్సూర్ పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణమంతా చింత

- నియోజకవర్గ కేంద్రంలో అధ్వానంగా రహదారులు
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ప్రతిపాదనలతో చేతులు దులుపుకుంటున్న అధికారులు
- పట్టించుకోని ఎమ్మెల్యే పరిటాల సునీత





రాప్తాడులోని నారాయణ స్వామి కట్ట వద్ద అధ్వానంగా ఉన్న సీసీ రోడ్డు

రాప్తాడు: రహదారులు ప్రగతికి చిహ్నాలు. రహదారి వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉంటే ఆర్థిక వ్యవస్థ అంత బలోపేతంగా ఉంటుంది. అభివృద్ధి చెందిన రహదారులు ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయ, పారిశ్రామిక, ముడిసరుకులు, కూరగాయలు, నిత్యావసరాల ఎగుమతులు, దిగుమతులు సులభతరం అవుతాయి. నియోజకవర్గ కేంద్రం రాప్తాడులో రహదారులు చూస్తే భయమేస్తోంది. గ్రామంలో రాకపోకలు సాగించాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాలు వచ్చినప్పుడు గుంతలతో నిండి బురదమయంగా మారుతున్నాయి. కొన్ని వీధుల్లో కుళాయిల కోసం రోడ్లు తవ్వి, అలాగే వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. అధికారంలోకి వస్తే రోడ్డుపై చిన్న గుంత కూడా లేకుండా చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విస్మరించింది. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఒక్క గుంతలోనూ మట్టి పోసిన దాఖలాలు లేవు. రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశామని అధికారులు చెబుతున్నా.. కార్యాచరణకు నోచుకోవడం లేదు. ఫలితంగా ప్రజలు రాకపోకలు సాగించాలంటే ఇబ్బంది పడుతున్నారు. రాప్తాడులో ప్రధాన రహదారులతో పాటు అంతర్ రోడ్లు, సీసీ రోడ్లపై గుంతలు పడ్డాయి. రహదారుల్లో రాకపోకలు సాగించడానికి వాహనదారులు ముప్పుతిప్పలు పడుతున్నారు. రాప్తాడు మీదుగా జేఎన్‌టీయూకు రోజూ మండలంలోని వివిధ గ్రామాలు, వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు రాప్తాడు బస్టాండు సర్కిల్, పెద్దమ్మ, మారెమ్మ దేవాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రోడ్లులో ప్రయాణం సాగిస్తుంటారు. ఈ రోడ్డులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దమ్మ, మారెమ్మ దేవాలయం, స్థానిక ప్రాథమిక పాఠశాల ముందు రోడ్డు దెబ్బతింది. ముఖ్యంగా గ్రామంలో కోట వీధి కాలనీ, మాజీ మండల ఉపాధ్యక్షుడు గవ్వల పరంధామ ఇంటి నుంచి నారాయణ స్వామి కట్ట కాలనీ, డ్రామా కట్ట కాలనీ, పీర్ల చావిడి రోడ్డు, పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బీసీ, ఎస్సీ కాలనీ రోడ్లు, నీలకంఠేశ్వర స్వామి కాలనీ రోడ్లతో పాటు తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పలు చోట్ల మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. వర్షకాలంలో ఈ రోడ్లపై రాకపోకలు సాగించాలంటే కష్టంగా ఉంటుంది.



కోట వీధిలో ఇలా..

స్పందించని అధికారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాప్తాడులో ప్రధాన రహదారులు, సీసీ రోడ్లు నిర్మించాలని అనేక మార్లు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె సోదరుడు మండల టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, అదే గ్రామానికి చెందిన మండల కన్వీనర్ పంపు కొండప్పతో పాటు మండల స్థాయి అధికారులకు ప్రజలు విన్నవించుకున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఉంది. గుంతలు లేకుండా చూడాలని రాప్తాడు ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు



గ్రామంలో సీసీ రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎక్కడా గంత ఉందో కూడా అర్థం కావడం లేదు. మేము ప్రతి రోజు 10 మంది స్థానిక మారెమ్మ దేవాలయంలో రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు భజన చేస్తుంటాం. భజన అయిపోయిన తర్వాత ఇంటికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. కరెంట్ పోతే గుంతలో పడి గాయాలపాలవుతున్నాం. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి గుంతలు పూడ్చాలి.

– ఒట్టి వన్నూరప్ప, రాప్తాడు

అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రామంలో చాలా చోట్ల రోడ్లపై గుంతలు ఏర్పాడ్డాయి. గుంతలు పూడ్చాలని అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా నీలకంఠేశ్వర స్వామి వీధి, మెయిన్ బజార్, బీసీ కాలనీ బజారు, కోట వీధిలో రోడ్లు మొత్తం గుంతలే దర్శనమిస్తున్నాయి. వర్షం వచ్చినప్పుడు ఎక్కాడా రోడ్డు ఉందో ఎక్కడా గుంత ఉందో తెలియడం లేదు. గ్రామాల్లో రోడ్లు వేయాలని అధికారులకు చెబితే వారు ఏ మాత్రం పట్టించుకోలేదు. అయితే అవసరం లేని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సీసీ రోడ్డు వేయించుకుంటున్నారు.

– సాకే చంద్ర, రాప్తాడు

'గుంతలను పూడ్చేశారు'



రోడ్డుపై గుంతలు లేకుండా చదును చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు: గత నెల కురిసిన భారీ వర్షాలకు రాప్తాడు సమీపంలో పండమేరు వంక ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల గుంతలు పూడ్చేందుకు సర్పంచ్ సాకే తిరుపాలు మట్టి తోలించారు. అయితే చదును చేయకుండా మట్టి దిబ్బలను అలాగే వదిలేశారు. దీనిపై ఈనెల 17వ తేదీన సాక్షి దినపత్రికలో 'ఆర్భాటం.. అంతులేని నిర్లక్ష్యం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన సర్పంచ్ తిరుపాలు.. గురువారం మట్టి దిబ్బలను జేసీబీతో చదును చేయించారు. టిప్పర్లతో అదనంగా మట్టిని తోలించి పండమేరు వంకపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. సమస్య పరిష్కారం కావడంతో జేఎన్‌టీయూ–అనంతపురానికి వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు సమస్యను కళ్లకు కట్టినట్లు చూపించిన సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు మెటీరియల్ పంపిణీ

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక నేతాజీ నగరపాలక ఉన్నత పాఠశాలలో తెలుగు టీచరు రామాంజనేయులు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు తెలుగు మెటీరియల్ పంపిణీ చేశారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ బాగా చదువుకుని ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళిక రచించి శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

దళిత టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: దళిత టీచర్ల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎంఈఎఫ్) నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబును కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్రశిక్షలో జీసీడీఓగా పని చేస్తున్న మహేశ్వరి రెన్నెళ్ల కిందట రిలీవ్ అయ్యారని తెలిపారు. భర్త పెద్దవడుగూరు ఎంఈఓ–2గా పని చేస్తున్న నేపథ్యంలో ఆమెకు గుత్తి జెడ్పీహెచ్ఎస్ (బాలికలు)కు పోస్టింగ్ ఇచ్చేలా పరిశీలించాలని కోరారు. తరిమెల జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వేమనారాయణ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఐదేళ్లుగా కాలు, చేయి సరిగా పని చేయడం లేదన్నారు. ఇటీవల గుండెపోటుకూ గురయ్యాడని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబం నివాసం ఉంటున్న కదిరి సమీపంలోని ఏదైనా స్కూల్‌కు డెప్యూటేషన్ వేయాలని విజ్ఞప్తి చేశారు. డీఈఓను కలిసిన వారిలో ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్, ఎంఈఓ–2లు గురుప్రసాద్, ఓబుళపతి ఉన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం

- ఏషియన్ మేయర్స్ ఫోరం సదస్సులో మేయర్ వసీం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: గత ప్రభుత్వంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఆరోగ్య శ్రీ కింద 3257 ప్రొజీజర్స్‌ను అందుబాటులోకి తెచ్చి పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా వైద్యాన్ని అందించారని మేయర్ వసీం పేర్కొన్నారు. ఇరాన్‌లోని ఖోర్రామాబాద్‌లో పదవ జనరల్ ఇంటర్నేషనల్ పట్టణ ఆరోగ్యం, ఎన్విరాన్‌మెంట్ సదస్సు గురువారం జరిగింది. ఈ సదస్సుల్లో మలేషియా, శ్రీలంక, టర్కీ రష్యా, ఫిలిప్పీన్స్ తదితర దేశాలకు చెందిన కొందరు మేయర్లు, ప్రతినిధులు, రాయబారులు, హై కమిషనర్లు, అంబాసిడర్లు పాల్గొన్నారు. ఈ సదస్సుల్లో మేయర్ వసీం మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్య రంగంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను పీపీటీ ద్వారా తెలియజేశారు. ఆరోగ్య శ్రీ ద్వారా సేవలు పొందిన తర్వాత కూడా విశ్రాంతి సమయంలోనూ ఆసరా కింద వారికి తమ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇంటి వద్దకే వైద్యులను పంపి వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. కొత్తగా అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించినట్లు గుర్తు చేశారు. 104, 108 ద్వారా ప్రజలకు సత్వర వైద్య సేవలందేలా చూశారన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఎక్కడా లేని విధంగా నాణ్యమైన సేవలందించి లక్షలాది మంది ప్రాణాలను కాపాడారని కొనియాడారు. 17 నూతన వైద్య కళాశాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

ఆకట్టుకున్న జానపద కళాప్రదర్శన



సంగీత వాయిద్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్థానిక పురావస్తుశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జానపద కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లా పర్యాటక శాఖ, మ్యూజియం శాఖ, ఇంటాక్ (భారతీయ సంస్కృతి, కళలు, వారసత్వ పరిరక్షణ సంస్థ) ఆధ్వర్యంలో రాయల్ ఫైన్స్ అకాడమీ వారి సౌజన్యంతో పలువురు కళాకారులు ప్రాచీన కళారూపాలను ప్రదర్శించారు. గిల్డ్ ఆఫ్ సర్వీస్ చిన్నారుల నృత్యప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది. ఈ సందర్భంగా కవి నబీరసూల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి కేంద్ర గ్రంథాలయం కార్యదర్శి రమ, రైతు సంఘం కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ తదితరులు మాట్లాడారు. మన సంస్కృతిలో ప్రధాన భాగమైన జానపదాలు మానసికోల్లాసంతో పాటూ నాగరికతను, విజ్ఞానాన్ని పెంచుతున్నాయన్నారు. ఈతరం వారికి వాటి ప్రాముఖ్యతను తెలియజేయడం కోసమే జానపద కళాప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ ప్రతినిధులు షేక్షావలి, గిరిధరరాయ్ రియాజుద్దీన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి నుంచి ముంబైకి.. నేడు బనానా రైలు

అనంతపురం అర్బన్: 'తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి ముంబైకి శుక్రవారం బానానా రైలు బయలుదేరి వెళుతుంది. విజయవాడ నుంచి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పర్చువల్‌గా రైలును ప్రారంభిస్తారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పక్కాగా ఉండాలి.' అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాడిపత్రి నుంచి గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు 34 వ్యాగన్లతో 680 మెట్రిక్ టన్నుల అరటి ఉత్పత్తులతో బనానా రైలు ముంబైకి వెళుతుందన్నారు. అక్కడి నుంచి షిప్ ద్వారా ఇరాక్ దేశానికి రవాణా అవుతాయన్నారు. రైల్వే స్టేషన్‌లో వీఐపీ లాంచ్‌లో అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రోటోకాల్ ఏర్పాట్లు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. స్టేషన్‌లో డిజిటల్ స్క్రీన్, టీవీలు, తదితర అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఆర్‌డీఓ కేశవనాయుడు, ఉద్యాన శాఖ డీడీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, డీఎంహెచ్ఓ ఈబీదేవి, ఎస్ఐసీ డీఐఓ రవిశంకర్, తాడిపత్రి రైల్వేస్టేషన్ మేనేజర్ అనిల్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ హనూప్ కుమార్, తాడిపత్రి మునిసిపల్ కమిషనర్ శివరామకృష్ణ, తహసీల్దార్ రజాక్‌వలి పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని వినతి

అనంతపురం అర్బన్: ఉన్నతాధికారులు చేయాల్సిన ఆన్‌లైన్ పనులను తమతోనే చేయిస్తూ తీవ్ర పని ఒత్తిడికి గురిచేస్తున్నారని డిజిటల్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో పంచాయతీ కార్యదర్శుల (గ్రేడ్–6) సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమేష్, ప్రధాన కార్యదర్శి నరేష్, తదితరులు కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిజిటల్ అసిస్టెంట్లను క్షేత్రస్థాయి పనులకు, బీఎల్ఓ, తదితర పనులకు ఉపయోగించకూడదని గతంలోనే రాష్ట్రస్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినప్పటికీ మండలస్థాయి అధికారులు వాటిని పాటించడం లేదని చెప్పారు. పని భారం పెరగడంతో ఉద్యోగి అత్యవసర పరిస్థితుల్లో పొందాల్సిన సెలవులను వినియోగించుకోలేకపోతున్నామన్నారు. సచివాలయంలో పని చేస్తున్న ఇతర ఉద్యోగులు కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ పరీక్ష ఉత్తీర్ణులై, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉన్నారన్నారు. అయినప్పటికీ వారూ చేయాల్సిన ఆన్‌లైన్ పనులనూ డిజిటల్ అసిస్టెంట్లే చేయాలంటూ మండలస్థాయి అధికారులు, సచివాలయం డీడీఓలు ఒత్తిడి చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ.. సోమవారం నిర్వహించే సమావేశంలో అధికారులకు సూచనలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి సాగర్‌కుమార్, మహిళ విభాగం అధ్యక్షురాలు అమృత, నాయకులు హనుమేష్, దివ్య, అహమ్మద్, నాగరాజు, చరణ్, విష్ణుప్రకాష్, వెంకటరమణ, మల్లికార్జున, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

పసికందుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: నెలలు నిండకుండా జన్మించిన పసికందుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. డీఈఐసీ సెంటర్‌లో అందిస్తున్న వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ వారాన్ని పురస్కరించుకుని గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రధానంగా పసికందుల్లో రెటీనా సమస్య వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆ సమస్యకు పరిష్కారం చూపేలా స్క్రీనింగ్ చేపడుతారన్నారు. పిల్లలకు కంటి రెటీనా పరీక్షలు నిర్వహించి, తదుపరి ఏమైనా సమస్యలుంటే కడప పుష్పగిరి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారని వెల్లడించారు. అనంతరం నిర్వహించిన స్క్రీనింగ్‌లో 21 మంది పసిపిల్లల్లో 10 మంది రెటీనా సమస్యతో బాధపడుతున్నట్లు పుష్పగిరి కంటి ఆస్పత్రి సీఈఓ బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ నారాయణ స్వామి, వైద్యులు డాక్టర్ దివ్య, డాక్టర్ శ్రీవిద్య, మేనేజర్ రజిత, కంటి పరీక్ష నిపుణురాలు జ్ఞాన ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.


ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పద్మశ్రీ

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా జియాలజీ అధ్యాపకురాలు పి.పద్మశ్రీని నియమిస్తూ కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డిని పూర్వ కళాశాల జమ్మలమడుగుకు పంపుతూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటిదాకా ఆయన ఇక్కడ ఆన్ డ్యూటీపై ఉన్నారు. ఆర్ట్స్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ డి.నాగలింగారెడ్డి ఉన్నారు. ఆయన ప్రస్తుతం ఆర్జేడీగా కొనసాగుతున్నారు. దీంతో ఇక్కడ ఇన్‌చార్జ్ ఇవ్వడం అనివార్యమైంది. పద్మశ్రీ 30 సంవత్సరాలుగా జియాలజీ అధ్యాపకులుగా పనిచేస్తూ ఎందరో విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారు. బోధనకే పరిమితం కాకుండా కళాశాల అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషించారు. వైస్ ప్రిన్సిపాల్‌గా కూడా విశిష్ట సేవలందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశాంక్ మౌళి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మశ్రీకి బొకేలు అందజేశారు.

24న కార్తీక వనభోజనాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆలిండియా వాల్మీకి గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ వాల్మీకి గెజిటెడ్ అధికారుల కోసం ఈనెల 24న కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు సంఘం సభ్యుడు, రిటైర్డ్ డెప్యూటీ కలెక్టర్ బి.ఈశ్వర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసే 'కార్తీక వనభోజనం' కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల్లోని వాల్మీకి గెజిటెడ్ అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 81791 92331 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

స్టాఫ్‌నర్సుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న స్టాఫ్‌నర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్‌బీ పద్మ

అనంతపురం మెడికల్: రోగులకు మెరుగైన సేవలందించి, ఆస్పత్రికి మంచి పేరు తీసుకొద్దామని స్టాఫ్ నర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్‌బీ పద్మ పిలుపునిచ్చారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఏపీజీడీఏ హాల్‌లో ఇటీవల స్టాఫ్‌నర్సు అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి ఓట్ ఆఫ్ థ్యాంక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ఆర్‌బీ పద్మ స్టాఫ్‌నర్సులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కోవిడ్‌లో రోగుల ప్రాణాలు కాపాడటంలో ఉత్తమ సేవందించినందుకు ప్రభుత్వం గుర్తించి ఇక్కడి స్టాఫ్‌నర్సులకు అవార్డు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అదే రీతిలో పని చేద్దామన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా స్టాఫ్‌నర్సుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ప్రధానంగా రోగులకు అందించే సేవలపై అప్రమత్తంగా ఉందామని గుర్తు చేశారు. ఒకరితో ప్రశ్నించే పరిస్థితి లేకుండా అంకితభావంతో పని చేద్దామన్నారు. రెగ్యూలర్, కాంట్రాక్ట్ అందరూ సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు భానులత, కార్యదర్శి లత, సభ్యులు నారాయణ స్వామి, హెడ్‌నర్సులు రాజన్‌లత, వసంత, పద్మజ, వాసంతి బాయి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నుంచి లక్ష్మీనారాయణ బహిష్కరణ

అనంతపురం అర్బన్: సీపీఎం పార్టీ అనంతపురం న్యూటౌన్ కమిటీలో సభ్యుడిగా ఉంటున్న లక్ష్మీనారాయణ అవినీతికి పాల్పడటంతో పార్టీ నుంచి బహిష్కరించామని కమిటీ కార్యదర్శి ఆర్.వి.నాయుడు తెలిపారు. వివరాలను గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. టీవీ టవర్ ప్రాంతంలో వేసిన ఇళ్ల స్థలాల్లో పేదల నుంచి లక్ష్మీనారాయణ రూ.8 లక్షలు వసూలు చేశాడని ఆరోపణలు వచ్చాయి. మహిళలను అసభ్యకర పదజాలంతో దూషించడం, దళితులపై దాడులకు పాల్పడుతున్నట్లు ప్రజలు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. విచారించిన పార్టీ అధిష్టానం లక్ష్మీనారాయణపై వచ్చిన ఆరోపణలు వాస్తవమని నిర్ధారించి, పార్టీ నుంచి బహిష్కరించిందని పేర్కొన్నారు.